EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
మంగళవారం
01-04-2025
పేజీలు: 02






# గ్యాస్ సిలిండర్ పేలి ఏడుగురు మృతి

పశ్చిమ బెంగాల్‌లో విషాదం చోటుచేసుకుంది. ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని పథార్ ప్రతిమా గ్రామంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పేలుడు సంభవించిన ఇంటిని కొందరు బాణసంచా తయారీ కేంద్రంగా ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో గత రాత్రి భారీ శబ్దంతో ఇంట్లో పేలుడు సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.పేలుడు సంభవించిన సమయంలో ఇంట్లో 11 మంది ఉన్నారు.

# తొలి మ్యాచ్‌లోనే అశ్వని కుమార్ చరిత్ర సృష్టించాడు

ఐపీఎల్ 2025లో ముంబయి ఇండియన్స్ బోణీ కొట్టింది. సొంతగడ్డపై కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబయి బౌలర్ల ధాటికి తొలుత బ్యాటింగ్ చేసిన కోల్‌కతా.. 116 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ లక్ష్యాన్ని ముంబయి 12.5 ఓవర్లలో ఛేదించింది. అరంగేట్ర బౌలర్ అశ్వని కుమార్ ముంబయి విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలి మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఐపీఎల్ తొలి మ్యాచ్‌లోనే నాలుగు వికెట్లు సాధించిన మొదటి భారత బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. ఐపీఎల్ కెరీర్‌లో తొలి బంతికే అతను వికెట్ (రహానె) పడగొట్టాడు. డీప్ బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో తిలక్ వర్మ తొలుత క్యాచ్ అందుకోవడంలో ఇబ్బంది పడినప్పటికీ చివరికి బంతిని ఒంటిచేత్తో ఒడిసిపట్టాడు. దీంతో అశ్వని కుమార్‌కు తొలి వికెట్ దక్కింది. తర్వాత ఒకే ఓవర్‌లో రింకు సింగ్, ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన మనీశ్ పాండేను ఔట్ చేశాడు. భారీ హిట్టర్ ఆండ్రీ రస్సెల్‌ను అద్భుతమైన బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. మొహాలీలో జన్మించిన అశ్వని కుమార్.. గతేడాది జరిగిన షేర్-ఎ-పంజాబ్ టీ20 టోర్నమెంట్‌లో మెరిసి వార్తల్లో నిలిచాడు. దీంతో ముంబయి మేనేజ్‌మెంట్ దృష్టిలో పడ్డాడు. 23 ఏళ్ల ఈ ఫాస్ట్ బౌలర్ డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయడంలో స్పెషలిస్ట్. ఐపీఎల్ 2025 మెగా వేలంలో అశ్వని కుమార్‌ను ముంబయి రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. 2024లో ఇతను పంజాబ్ కింగ్స్ జట్టులో ఉన్నాడు. కానీ, ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే అవకాశం రాలేదు. 2022 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ తరఫున అరంగేట్రం చేసి నాలుగు మ్యాచ్‌లు ఆడాడు.







## ఫోన్‌పే, గూగుల్ పే వాడుతున్నారా?

ఇటీవల యూపీఐ లావాదేవీలు ఎక్కువైపోయాయి. అందరూ యూపీఐ ద్వారానే బిల్లులు కట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్పీసీఐ) కొత్త రూల్స్(UPI Rule Change) తీసుకొచ్చింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అవి అమలులోకి రానున్నాయి. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం.. యూపీఐ లావాదేవీలను పటిష్టంగా నిర్వహించేందుకు కొత్త సెక్యూర్టీ చర్యలు చేపట్టారు. యూపీఐతో లింకున్న ఇన్‌యాక్టివ్ నెంబర్లను డీయాక్టివేట్ చేయనున్నారు. చాన్నాళ్ల నుంచి తమ మొబైల్ నెంబర్‌ను యూపీఐ లావాదేవీలకు వాడని వారు తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ ఒకటో తేదీలోగా ఆ వివరాలను తమ బ్యాంక్ వద్ద అప్‌డేట్ చేసుకుంటే, యూపీఐ సర్వీసులకు అంతరాయం ఉండదు. సెక్యూర్టీ సమస్య రాకుండా ఉండేందుకు తమ వద్ద ఉన్న ఇన్‌యాక్టివ్ నెంబర్లను బ్యాంకులు, ఫోన్‌పే, గూగుల్ పే లాంటి థార్డ్ పార్టీ యూపీఐ ప్రొవైడర్లు తీసివేయాల్సి ఉంటుంది. ఇక కనీస బ్యాంక్ బ్యాలెన్స్ విషయంలోనూ కొత్త నిబంధనలు తీసుకురానున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంకు లాంటి బ్యాంకులు.. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మినిమం బ్యాలెన్స్ రూల్స్‌ను మార్చుతున్నాయి.



## వైసీపీ కార్యకర్తపై దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలు

పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల మండలం జూలకల్లులో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. నార్రెడ్డి వెంకటరెడ్డి అనే వైయస్ఆర్‌సీపీ కార్యకర్తపై కర్రలు, ఇనుప రాడ్లతో మూకుమ్మడి దాడి చేశారు టీడీపీ కార్యకర్తలు. ఈ దాడిలో వెంకటరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకటరెడ్డిని ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. గ్రామంలో వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలు ఉండటానికి వీల్లేదంటూ టీడీపీ నాయకులు దాడి చేసినట్లు బాధితుడు వెంకటరెడ్డి పేర్కొన్నారు. టీడీపీకి చెందిన సామేలు, బత్తుల రాజేష్, చల్లా వీరయ్య వారి అనుచరులు దాడి చేసినట్లు బాధితుడు వెంకటరెడ్డి చెబుతున్నాడు. కాగా, కూటమి పాలనలో రెడ్ రాజ్యాంగం అంటూ వైయస్ఆర్‌సీపీ శ్రేణులపై దాడికి దిగుతున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజవర్గానికి చెందిన కురబ లింగమయ్యను దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. అధికార పార్టీ అన్యాయాలను ప్రశ్నించినందుకు.. వారి దాడులను వ్యతిరేకించినందుకు వైయస్ఆర్‌సీపీకి చెందిన కార్యకర్తలపై టీడీపీ దాడులకు దిగుతోంది అని వైసీపీ నేతలు వాపోతున్నారు.



## గుండెపోటుకు సరికొత్త ఔషధం

జన్యుపరమైన కారణాలతో గుండెపోటుకు గురయ్యే ప్రమాదాన్ని దాదాపు పూర్తిగా నివారించే సరికొత్త ఔషధాన్ని అమెరికా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. లెపాడిజిరాన్ అనే ఈ మందును టీకా రూపంలో ఏడాదికి ఒకసారి తీసుకుంటే గుండె జబ్బులు దరిచేరవని వారు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ మందు వినియోగం ఎంతవరకు సురక్షితమనే దానిపై తుది పరీక్షలు జరుగుతున్నాయని, దీనివల్ల పెద్దగా దుష్ప్రభావాలు కూడా లేవని తేలిందని వారు వివరించారు. వంశపారంపర్యంగా వచ్చే గుండె జబ్బుల ముప్పు ఈ ఔషధం ద్వారా 94 శాతం తగ్గుతుందని, అదేవిధంగా పక్షవాతం ముప్పు కూడా గణనీయంగా తగ్గుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అమెరికాకు చెందిన ప్రముఖ మల్టీనేషనల్ ఫార్మా కంపెనీ ఎలి లిల్లీ ఈ మందును తయారు చేస్తోంది. త్వరలోనే దీనిని మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఇటీవల షికాగో యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో లెపాడిజిరాన్ ఔషధం పనితీరును శాస్త్రవేత్తలు వివరించారు. ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలు న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ లో ప్రచురితమయ్యాయి.

## ఆ భూములు అమ్మడానికి మీకు ఏం హక్కు ఉంది

భాగ్యనగరంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పరిసర ప్రాంతాలు మాత్రమే స్వచ్ఛమైన గాలిని అందించే ప్రదేశాలుగా ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. భవిష్యత్తులో పశ్చిమ హైదరాబాద్ ఢిల్లీ మాదిరిగా వాయు కాలుష్యంతో నిండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఊపిరి తీసుకోవడం కూడా కష్టమయ్యే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ ప్రాంతంలోని భూమిని సంరక్షించగలిగితే హైదరాబాద్ నగరానికి ఊపిరితిత్తుల్లా ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.400 ఎకరాల భూమిని విక్రయించి రూ. 30 వేల కోట్లు సంపాదించాలని కాంగ్రెస్ పార్టీ నేతలు చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆ భూములను విక్రయించడానికి వారికి ఏం హక్కు ఉందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీ కోసం 45 వేల ఎకరాలను సిద్ధం చేస్తున్నప్పుడు, ఈ 400 ఎకరాలు ఎందుకని నిలదీశారు. హైకోర్టులో పిటిషన్ విచారణకు రాకముందే భూమిని చదును చేస్తున్నారని ఆరోపించారు. కోర్టుకు వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భూములను చదును చేస్తోందని మండిపడ్డారు.వందల సంఖ్యలో పోలీసులను




మోహరించి, అడ్డుకునే వారిని కొడుతూ, మహిళల పట్ల దుశ్శాసన పర్వాన్ని తలపిస్తూ భూమిని చదును చేస్తున్నారని ఆరోపించారు. అక్కడ జరుగుతున్న అన్యాయం తమకు కనపడటం లేదా, వినపడటం లేదా అని నెమళ్లు సహా వివిధ జంతువులు ప్రశ్నిస్తున్నాయని అన్నారు.



## గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఆందోళన చేసిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఆందోళన నిర్వహించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మాదాపూర్ డీసీపీ వెల్లడించారు. నిన్న మధ్యాహ్నం మూడున్నర గంటలకు టీజీఐఐసీకి చెందిన 400 ఎకరాల భూమిని చదును చేసేందుకు అధికారులు వచ్చారని, అదే సమయంలో హెచ్‌సీయూకు చెందిన కొందరు ఆందోళనకు దిగారని ఆయన తెలిపారు.జేసీబీని అడ్డుకునే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. పోలీసులపై పలువురు దాడి చేయడంతో మాదాపూర్ ఏసీపీకి గాయాలయ్యాయని అన్నారు. మొత్తం 53 మందిని అదుపులోకి తీసుకున్నామని, ఆ తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు చెప్పారు. హెచ్‌సీయూకు సంబంధం లేని ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు.



## హాట్ జాన్వీ

రెగ్యులర్ ఫ్రెష్ అండ్ హాట్ లుక్స్‌తో యూత్‌కి పిచ్చెక్కించే జాన్వీ కపూర్ తాజాగా మరిన్ని స్టన్నింగ్ లుక్స్ పోస్ట్ చేసింది. లేలేత అందాలు ఆరబోస్తూ కుర్రకారును కవ్వించింది. దీంతో జాన్వీ షేర్ చేసిన ఈ ఫొటోస్ క్షణాల్లో వైరల్‌గా మారాయి. లేలేత గ్లామర్ డోస్ దట్టించడంలో ముందు వరుసలో ఉండే ఈ భామ.. ఎక్కడా తగ్గేదే లే అంటోంది. అందాల డోస్ పెంచేసి ఆమె షేర్ చేసిన లేటెస్ట్ ఫొటోస్ చూసి కుర్రకారు పిచ్చెక్కిపోతున్నారు. ఆమె అందాన్ని తెగ పొగిడేస్తూ రొమాంటిక్ కామెంట్స్ చేస్తున్నారు. దివంగత శ్రీదేవి కూతురిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది జాన్వీ. స్టార్ కిడ్ అనే మార్క్ పెట్టుకొని బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అలరిస్తోంది. ప్రస్తుతం సినిమాల కంటే వెబ్ సిరీస్, కమర్షియల్ యాడ్స్, ప్రమోషన్స్ కోసమే.

## కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మాపై కేసులు

కూటమి ప్రభుత్వ వేధింపులకు భయపడేది లేదని వైయస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు మేలు చేయకుండా.. వ్యవస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటోందని మండిపడ్డారు. రేషన్ బియ్యం వ్యవహారంలో కృష్ణా జిల్లా పోలీసులు హైకోర్టును సంప్రదించిన పరిణామంపై ఆయన మీడియాతో మాట్లాడారు. ''మేం ఏ పాపం చేయలేదని పోలీసు వ్యవస్థకు తెలుసు. ప్రభుత్వానికి జరిగిన నష్టానికి రెట్టింపు జమ చేశాం. అయినా నా భార్య జయసుధ పై ఏడు సంవత్సరాల పైబడి శిక్ష పడే సెక్షను పెట్టి అరెస్టు చేయాలని చూశారు. ఆ సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని జిల్లా కోర్టు నా భార్యకు బెయిల్ మంజూరు చేసింది. ఇప్పుడు నా భార్యకు ఇచ్చిన బెయిల్ ను రద్దు చేయాలని హైకోర్టుకు వెళ్లారు.



మా కుటుంబంపై తప్ప సివిల్ సప్లై శాఖ ఇంతవరకూ ఎవరిపైనా ఒక్క క్రిమినల్ కేసు పెట్టలేదు. అసలు సివిల్ సప్లై శాఖ అనేది ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ఎవరిపైనా క్రిమినల్ కేసులు లేవు. సాక్షాత్తూ సివిల్ సప్లై మంత్రి వెళ్లి 22 వేల టన్నుల బియ్యం పట్టుకున్నా కేసు లేదు.

## ఏప్రిల్ 14 వరకు 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తు గడువు పెంపు

తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త తెలిపింది. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం దరఖాస్తు గడువును పొడిగించింది. గతంలో ఏప్రిల్ 5వ తేదీ వరకు ఉన్న గడువును ఏప్రిల్ 14 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.ఈ పథకం అమలు తీరుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## కాలినడకన వెళ్లనున్న అనంత్ అంబానీ

బిలియనీర్ ముఖేశ్ అంబానీ కుమారుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ డైరెక్టర్ అనంత్ అంబానీ గుజరాత్‌లోని జామ్‌నగర్ నుంచి ద్వారకకు కాలినడకన వెళ్తున్నారు. ఈ రెండు నగరాల మధ్య ఉన్న దూరం 140 కిలోమీటర్లకు పైనే. తన వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడొద్దనే ఉద్దేశంతో భారీ భద్రతా మధ్య రాత్రివేళ నడక సాగిస్తున్నారు. ఏప్రిల్ 10న తన పుట్టిన రోజు నాటికి అనంత్ ద్వారకకు చేరుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు.



## కుప్పకూలిన భారత స్టాక్ మార్కెట్లు

కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజునే దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా సుంకాల ఆందోళనలతో సెంటిమెంట్ దెబ్బతిన్నది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున మార్కెట్లు పతనమవుతున్నాయి. ఈద్ సందర్భంగా సోమవారం మార్కెట్లు పని చేయని విషయం తెలిసిందే. మంగళవారం మార్కెట్లు నష్టాలతోనే మొదలయ్యాయి. ప్రారంభంలోనే సెన్సెక్స్ 639.13 పాయింట్లు తగ్గి.. 76,775.79 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సైతం 180.25 పాయింట్లు తగ్గి 23,339.10 పాయింట్లకు చేరింది. ప్రస్తుతం సెన్సెక్స్ 1265.12 పాయింట్లు తగ్గి.. 76149.80 పాయింట్ల వద్ద ట్రేడవుతున్నది.




## ఈపీఎఫ్‌వో గుడ్‌న్యూస్

ప్రావిడెంట్ ఫండ్ సభ్యులకు కేంద్రం శుభవార్త తెలపనుంది. ఇప్పటివరకు ఆటో సెటిల్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ క్లెయిమ్ (ఏఎస్ఏసీ)పై ఉన్న లక్ష రూపాయ పరిమితిని రూ.5 లక్షలకు పెంచుతున్నట్టు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్ఓ) ప్రకటించే అవకాశం ఉందని ఏఎన్ఐ వార్తాసంస్థ తెలిపింది. ఇప్పడున్న లక్ష రూపాయలను ఐదు రెట్లు పెంచి ఐదు లక్షలకు పెంచుతూ చేసిన ప్రతిపాదనకు కేంద్ర కార్మిక, ఉద్యోగ శాఖ కార్యదర్శి సుమితా దవ్రా ఆమోదం తెలిపారు. గత వారం కశ్మీర్‌లో సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రమేష్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో దీనిని ప్రతిపాదించారు. దీనిని తుది ఆమోదముద్ర కోసం సీబీటీకి పంపారు. ఇది అమలులోకి వస్తే ఏఎస్ఏసీ ద్వారా రూ.5 లక్షలు విత్‌డ్రా చేసుకునే ప్రయోజనం సుమారు 7.5 కోట్లమంది పీఎఫ్ సభ్యులకు చేకూరుతుంది. అనారోగ్య, వైద్య చికిత్స కోసం సభ్యులు అడ్వాన్స్ కింద గరిష్ఠంగా రూ.50 వేల నగదు అత్యవసరంగా డ్రా చేసుకునే సౌకర్యాన్ని 2020 ఏప్రిల్‌లో ప్రవేశపెట్టారు.

# అత్యాచారం చేసి..
# నోట్లో మూత్రం పోసి..



తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనం కోసం వచ్చిన ఓ మహిళ పట్ల మానవ మృగాలు దాడి చేసి పాశవికంగా ప్రవర్తించాయి. తలుచుకుంటేనే ఒళ్లు జలదరించే రీతిలో మహిళపై ఏడుగురు కిరాతకులు సామూహికంగా అత్యాచారానికి పాల్పడుతూ చిత్రహింసలు పెట్టిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఊర్కొండ మండలం ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఈ దారుణం చోటుచేసుకోవడం కలకలం సృష్టించింది.

దాడి చేసి.. చెట్టుకు కట్టేసి

ఊర్కొండపేట ఆంజనేయస్వామి ఆలయానికి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన మహిళపై కామాంధులు దాడికి తెగబడ్డారు. శనివారం సాయంత్రం ఆలయానికి వచ్చిన ఆమె తల్లిదండ్రు లు, పిల్లలు ఆలయ పరిసరాల్లో పడుకోగా, రాత్రి 10 గంటల సమయంలో మూత్ర విసర్జన కోసం బయటకు వెళ్లింది. అక్కడ కనిపించిన బంధువుతో మాట్లాడుతుండగా, అక్కడే కాచుకుని ఉన్న ఏడుగురు కామాంధులు వారిపై దాడిచేసి, ఆమె బంధువును చెట్టుకు కట్టేశారు. మహిళపై అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తూ ఏడుగురు కలిసి సా మూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కనీసం తాగేందుకు నీళ్లు ఇవ్వమని వేడుకున్నా కనికరించలేదు. పైగా నోట్లో మూత్రం పోసి అత్యంత పాశవికంగా ప్రవర్తించినట్టు తెలిసింది. ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మహిళ వెనకడుగు వేసినట్టు తెలిసింది. తర్వాత కుటుంబ సభ్యుల భరోసా మేరకు ఎట్టకేలకు సోమ వారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గంజాయి, మద్యం మత్తులో..

జిల్లాలో పలుచోట్ల గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, బహిరంగంగా మద్యం తాగుతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయి. ఈ మత్తులో విచక్షణ కోల్పోయి ఇష్టారీతిగా అఘాయిత్యాలు, నేరాలకు పాల్పడుతున్నారు. ఊర్కొండపేట ఆలయ పరిసరాలతోపాటు జిల్లాలో పలుచోట్ల ఇతర దర్శనీయ ప్రదేశాల్లో బహిరంగ మద్యపానం, గంజాయి వినియోగంపై తరచుగా ఫిర్యాదులు వస్తున్నా, పోలీసులు స్పందించడం లేదన్న ఆరోపణలున్నాయి. పలుచోట్ల ఫిర్యాదు చేసినా, తరచుగా ఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నా ఆయా చోట్ల పో లీసుల నిఘా ఉండటం లేదు. తాజాగా మహిళపై సామూహిక అత్యాచార ఘటనలో గంజా యి, మ ద్యం మత్తులో నిత్యం జోగుతున్న స్థానిక యువకులు, పలువురు ఆటోడ్రైవర్ల పాత్ర ఉందని తెలుస్తోంది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు ఏడు గురు నిందితులను అదుపులోకి తీసుకు న్నారు. వారికి గతంలో ఏమైనా నేర చరిత్ర ఉందా.. ఇంకా ఎవరికైనా ఈ ఘటనతో సంబంధం ఉందా.. అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు.

వేగంగా విచారణ చేస్తున్నాం..

బాధితురాలి నుంచి ఫిర్యాదు అందిన వెంటనే ఎస్ఐ, సీఐ అధికారులు స్పందించి కేసు నమోదు చేశారని ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తెలిపారు. కేసుపై వేగంగా విచారణ కొనసాగుతోందన్నారు. ఏడుగురు నిందితులను గుర్తించి.. అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. బాధితురాలిపై నిందితులు అత్యంత దారుణంగా ప్రవర్తించారని, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి.. కఠిన శిక్షపడేలా చూస్తామన్నారు.

నిందితులు ఎవరైనా వదిలిపెట్టం

జడ్చర్ల టౌన్: ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట శివారులో జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో నిందితులు ఎవరైనా వదిలేది లేదని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారు ఏ పార్టీకి చెందిన వారైనప్పటికీ వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని నాగర్‌కర్నూల్ ఎస్పీని కోరానని వెల్లడించారు. ఘటన పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారానికి పాల్పడిన వారు ఓ పార్టీకి చెందిన నాయకులు అని తన దృష్టికి వచ్చిందని, అయితే ఈ ఘటనలో తాను రాజకీయాలు చేయదలుచుకోలేదన్నారు. బాధిత యువతికి న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని, యువతికి అండగా ఉంటామన్నారు. అలాగే ఊర్కొండ పోలీసులతో మాట్లాడి ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చి రాత్రి పూట బస చేసే భక్తులకు రక్షణ కలిపించాలని కోరానన్నారు.




## తన పిల్లలు భారత్‌లోనే పెరగాలంటున్న అమెరికా యువతి

ఉన్నత చదువులు, ఉపాధి కోసం ఎంతోమంది భారతీయ యువతీ యువకులు అమెరికాలో స్థిరపడాలని కలలు కంటుంటారు. అమెరికా వెళ్లేందుకు అనేక వ్యయప్రయాసలు పడుతుంటారు. కొందరైతే అక్రమ మార్గాల్లో అమెరికా వెళ్లి గెంటివేయబడుతున్నారు. ఇలాంటి పరిస్థితులు నెలకొని ఉండగా, అమెరికాకు చెందిన ఓ మహిళ మాత్రం తన పిల్లలు భారత్‌లోనే పెరగాలని కోరుకోవడంతో పాటు భారతదేశ ఔన్నత్యాన్ని ఆకాశానికి ఎత్తేలా కీర్తించడం విశేషం. తన పిల్లలను భారత్‌లో ఎందుకు చదివించాలని భావిస్తుందో వివరిస్తూ ఆమె చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్కిఫిష్ డెవలప్‌మెంట్ కంటెంట్ క్రియేటర్ అయిన అమెరికన్ మహిళ క్రిస్టెన్ ఫిషర్ తన ముగ్గురు పిల్లలతో కలిసి గత నాలుగు సంవత్సరాల నుంచి ఢిల్లీలో ఉంటోంది. తన పిల్లలు భారతదేశంలో పెరిగితే ప్రయోజకులు అవుతారంటూ ఆమె ఓ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. అమెరికాలో కంటే వారి బాల్యం భారత్‌లో గడిస్తే ఎందుకు మంచిగా ఉంటుందో కూడా ఆమె వివరించింది. భారత్‌లో నివసిస్తే తన పిల్లలు విభిన్న వ్యక్తులు, వారి సంస్కృతులను చాలా సులభంగా అర్థం చేసుకోగలుగుతారని, దానివల్ల సామాజిక నైపుణ్యాలు మెరుగుపడటంతో పాటు సానుభూతిగా వ్యవహరించడం తెలుస్తుందన్నారు.

## వైరల్ అవుతున్న 'సర్దార్ 2' ప్రోలాగ్ వీడియో




2022లో కార్తి హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో వచ్చిన స్పై, యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీకి సీక్వెల్‌గా 'సర్దార్ 2' వస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ 'ప్రోలాగ్' పేరిట ఓ వీడియోను విడుదల చేశారు. ప్రముఖ నటుడు ఎస్‌జే సూర్యను ప్రతినాయకుడిగా పరిచయం చేస్తూ ఈ వీడియోను పంచుకున్నారు. ఇక ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. కార్తి సరసన హీరోయిన్లుగా ఆషిక రంగనాథ్, మాళవిక మోహనన్ నటిస్తున్నారు.

## హాట్ లుక్‌లో తాప్సీ



రెగ్యులర్ హీరోయిన్ అయిన తాప్సీ బేబీ, పింక్, ది ఘాజీ ఎటాక్, బద్లా, మిషన్ మంగళ్, తప్పడ్, హసీనా దిల్రూబా, రష్మీ రాకెట్ చిత్రాలతో తనకంటూ ఓ ప్రత్యేక నటిగా నిరూపించుకుంది. హిందీలో హీరోయిన్ సెంట్రిక్ సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తూ వస్తున్న తాప్సీ పన్ను ఇప్పుడు కమర్షియల్ సినిమాల్లోనూ నటిస్తోంది. ఆమె ఇటీవల షారుఖ్‌తో కలిసి 'డంకి', అక్షయ్ కుమార్‌తో 'ఖేల్ ఖేల్ మైన్' ఆగస్టు 15న విడుదల కానుంది. నటి తాప్సీ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "నేను మరొకరిలా జీవించాలని అనుకోను, నాలాగే జీవించాలనుకుంటున్నాను. బాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకునే నటి కావాలని నేను కోరుకోవడం లేదు. నా జీవితంలో నేను ఎప్పుడూ అగ్రస్థానంలో ఉంటాను. నేను ఎవ్వరి సాయంతో నడవను, ఎందుకంటే నేను మాత్రమే నడుస్తున్నాను.

## బ్యాంకాక్‌లో భూవిలయం.. ఆ భవన శిథిలాల కింద
# 300 మంది కార్మికులు!

ఇటీవల మయన్మార్‌తో పాటు థాయ్‌లాండ్‌లో 12 నిమిషాల వ్యవధిలోనే రెండు సార్లు భారీ భూకంపాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ భూ ప్రకంపనల ధాటికి అనేక భవంతులు ఊగిపోగా.. పలు భవనాలు నేలమట్టమయ్యాయి. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవంతి పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు మృతిచెందగా.. 74 మంది శిథిలాల కింద చిక్కుకున్నారని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే ఆ సంఖ్య 300 నుంచి 400 వరకు ఉండే అవకాశముందని తాజాగా కథనాలు వెలువడుతున్నాయి. ఇప్పటి వరకూ ఇక్కడ 13 మృతదేహాల వెలికితీసినట్లు అధికారులు పేర్కొన్నారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన నిర్మాణ కార్మికుల్లో దాదాపు 60మంది మయన్మార్ వాసులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మిగతా వారంతా కూలి పనుల కోసం విదేశాల నుంచి తీసుకొచ్చిన కార్మికులేనని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సజీవంగా ఉన్న వారిని,



మృతదేహాలను గుర్తించడానికి అధునాతన పరికరాలతో పాటు జాగిలాలను ఉపయోగిస్తున్నారు. 2020లో ఈ భవన నిర్మాణం ప్రారంభించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీని నిర్మాణంలో చైనాకు చెందిన ఓ సంస్థకు భాగస్వామ్యం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ భవంతి కూలిన తర్వాత నలుగురు చైనీయులు శిథిలాలు ఉన్న ప్రాంతం వద్దకు అక్రమంగా వెళ్లి కొన్ని పత్రాలను తీసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఇదే ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇతర ఎత్తయిన భవనాలు సురక్షితంగానే ఉన్నా, ఇది మాత్రమే కూలిపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. శిథిలాల నుంచి సేకరించిన నిర్మాణ సామగ్రిని పరిశీలించగా.. అందులో నాసిరకం ఉక్కు, ఇతర, నిర్మాణ సామగ్రి వాడినట్లు గుర్తించామన్నారు.

## జార్ఖండ్‌లో ఘోర రైలు ప్రమాదం
### మంటల్లో లోకో పైలెట్లు సహా ముగ్గురు మృతి..!

జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు గూడ్స్ రైళ్లు ఢీకొట్టుకున్నాయి. ఆ తర్వాత మంటలు చెలరేగి రెండు ఇంజిన్లకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో లోకో పైలెట్లు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ ఘటనలో ముగ్గురు సీఐఎస్ఎఫ్ జవాన్లు సైతం గాయపడ్డట్లు తెలుస్తున్నది. ఈ ఘటన తెల్లవారు జామున 3.30 గంటలకు జరిగినట్లు తెలుస్తున్నది. ఫరక్కా నుంచి లాల్మాటియాకు వెళ్తున్న గూడ్స్ రైలు బర్హెట్‌లో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టినట్లు సమాచారం. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో.. కష్టపడి మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉన్నది. ఆదివారం ఒడిశాలో రైలు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. కామాఖ్య ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. కటక్‌లోని నెర్గుండి రైల్వేస్టేషన్ సమీయంలో ప్రమాదం జరిగింది. బెంగళూరు నుంచి రైలు నంబర్ 12251 అసోంలోని కామాఖ్య స్టేషన్‌కు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మరణించగా.. ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఒడిశాలోని కటక్ జిల్లాలో ఆదివారం ఒక ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిందని ఓ అధికారి పేర్కొన్నారు. ఎస్ఎంవీటీ బెంగళూరు-కామాఖ్య ఏసీ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 11 కోచ్‌లు మంగూలి సమీపంలోని నెర్గుండిలో ఉదయం 11.54 గంటలకు పట్టాలు తప్పినట్లు తెలిపారు.